## భర్తఓటమి

నేనూ ప్రసాదరావు "గృహప్రవేశం" సినిమాకు వెళ్ళాము. భార్య సీతాకోక చిలుకలాగా అలంకరించుకొని, భర్త చేతికి కుర్రాన్ని యిచ్చి భర్తప్రక్కనే తను కూర్చుంది. ఆ వెనుక కుర్చీలలో మేము కూర్చున్నాము. కొంతసేపటికి ఆ కుర్రాడు ఏడవడం ప్రారంభించాడు. కుర్రాన్ని యెత్తుకోవడంలో ఆ దంపతులు వంతు లాడుకోవడం ప్రారంభించారు. ఆఖరికి భార్యే కుర్రాన్ని తప్పనిసరిగా యెత్తుకోవలసివచ్చింది. కుర్రాడు మాత్రం యింకా చిన్నగా ఏడుస్తూనేవున్నాడు. కాని ఆమెకు ఎత్తుకోవడానికి యిష్టంలేదు. భర్తను ఎత్తుకోమని ఎంత బ్రతిమాలినా యెత్తుకోవడం లేదు. ఒక యుక్తిపన్నింది. "ఏమండి వాడిని మీరు ఎత్తుకోమంటే యెత్తుకోరు. వాళ్లందరూ నావైపు అదో మాదిరిగాచూస్తున్నారు" అంది. వెంటనే ఆ మానవునకు తనభార్యను ఇతరులు వారచూపులు చూడడం కష్టంతోచింది. "అయితే వాణ్ణి నేను ఎత్తుకుంటానులే" అని భార్యచేతుల్లోంచి ఆకుర్రాణ్ణి తీసుకున్నాడు. తన పంతం నెగ్గినందుకు ముసిముసి నవ్వులు నవ్వుకొంది.

ఇందుగు గోపాలరావు

* * *

## ప్రయత్న విఫలులు

కోదండం శెట్టి బ్లాకులో లక్షలు లక్షలు గడించాడు. కాని పిల్లికి బిచ్చం పెట్టడు. దైవంపేరు ఏనాడూ తలచిన పాపానపోలేదు. అతనికి మరో భయం. దేముడిపేరు తలుస్తే, బాపనాళ్ళువచ్చి దేముడి కభిషేకమని, దక్షిణని చెప్పి డబ్బు గుంజుకుపోతారు. అంచేత పూర్తిగా దైవంపేరేనా తలవడం మానేశాడు. ఇంతలోగా సడన్‌గా జబ్బుచేసిందతనికి. ఇక చూడండి యెక్కడలేని చుట్టాలు హాజరు. మరణశయ్యా మీదున్నా డబ్బో, డబ్బో అన్నగోలే శెట్టికి. చివరకలాగే మంచం దించేశారు శెట్టిని. గొంతు పడిపోయింది. అతని నోటంట "నారాయణ" అనిపించడానికి సర్వ యత్నాలుచేసి విఫలులయ్యారు. చివరకు ఒక బుద్ధిశాలి ఇంత నారకట్ట తీసుకొచ్చి శెట్టికి చూపి ఇదేంటని అడిగాడు. పాపం "నార" అన్న ముక్కైనా అంటాడని వారి ఆశ. కాని పొరపాటు నేనా ఆపని జరగలేదు. "పీచు పీచు" అన్నాడు శెట్టి. విఫలప్రయత్నులయిన బంధువులు నోరుమూశారు.

ఆకెళ్ల వెంకటరెడ్డిశాస్త్రి

* * *

## తానొకటి తలుస్తే?

మాచెట్టి విజయనగరం కమాను కట్టాడు. త్రోవలో ఓ చిన్న ప్యాసింజర్ హాల్టు స్టేషను వుంది. అక్కడ రెండు నిమిషాలుకన్నా ట్రెయిను నిలుపరు. అక్కడ తాటిరేకలో వేసి, తాటిముంజలు అమ్ముతారు. అట్టేసేపు ట్రెయిను నిలబడదు. కాబట్టి ఆ స్టేషన్లో ప్లాటుఫారం మీద నిలబడి వాళ్ళు అమ్మడం రైల్లో వున్నవాళ్లు కిటికీ సందుల్లోంచి అందుకొని డబ్బులు విసిరేయడం అలవాటు. ఇంకా కొంతమంది ముంజలు తీసుకొని, డబ్బు యివ్వడం ఆలస్యంచేయడం ట్రెయిను కదిలిపోవడం గూడా అలవాటే. మాచెట్టిగూడా ఆరోజు కిటికీలోంచి వొంగోని ముంజలు తీసుకొని డబ్బు యివ్వకుండా ఆలోచిస్తున్నాడు. కిందనుంచి వాడు డబ్బు అడుగుతున్నాడు. ఇంతలో ట్రెయిను కదిలింది మా చెట్టి సంతోషిస్తున్నాడు డబ్బులు మిగిలాయిగదా అని. ఇంతలో వాడికళ్ళు చెట్టిగారి భుజముపైని వ్రేలాడుచున్న టర్కీ టవల్ మీద పడ్డాయి. వెంటనే వాడు ఆ టర్కీటవల్ లాగేశాడు! బండి వేగం హెచ్చింది చెట్టి నిర్ఘాంతపోయేడు. వాడు చిరునవ్వు నవ్వాడు.

బెహరా జగన్నాథం

## సినిమా లేఖ

టి. వి. ఎ. నరసింగరావు

*

ప్రియమయిన రాజేశ్వరికి :

నీస్నేహితురాలు "మల్లీశ్వరి" వ్రాయునది :— మనం మల్లా చాలారోజులకు కల్సుకున్నాము. "మన ఇద్దరం" చిన్నప్పుడు ఎంత సర్దాగా ఉండేవాళ్లమో అంత వేరు అయ్యాము. నువ్వు ఒక రింటికి "చిన్నకోడలు" అయ్యావు. నేనూ అంతే. నీభర్త "బాలరాజు" నువ్వు చాలా అన్యోన్యముగా వుంటావని విని చాలా సంతోషించాను. నేనూ నాభర్త చాలా "ఆదర్శం"గా జీవిస్తున్నాము. మొన్న మనస్నేహితురాలు "మంగళ" ఎవరితో మాట్లాడుతుంటే అతనిభర్త వీధిలోంచి అప్పుడే వచ్చి దాన్ని తన్ని బయటికి యీడ్చివేసాడు. అది మా యింటికి యేడ్చుకొంటూవచ్చి వారు యెప్పుడూ యీలాగే అనుమానముపడి ఇంట్లో నన్ను "కూలీ"దానకన్న హీనముగాచూస్తారు అని "కన్నీరుకారుస్తూ" "ఆడబ్రతుకు" అయి పుట్టకూడదు అంది. నేను ఎంతో నచ్చచెప్పాను. "ఆడజన్మ" యెత్తిన తరువాత కష్టాలు తప్పవని "పుట్టిల్లు"లో ఉన్న సుఖం "అత్తింటికాపురం"చేస్తేవుండదని నచ్చచెప్పి దానిని ఇంటికి పంపించాను. మన స్నేహితులు "లక్ష్మమ్మ" "బాలనాగమ్మ" "జ్యోతి" "కాంచన" అందరినీ అడిగినట్లు చెప్పు. వెంటనే ఉత్తరము వ్రాయి.

నీ స్నేహితురాలు

"మల్లీశ్వరి"